# భారత్ బంద్!

ఇదేదో తెలుగు సినిమానేసి భ్రమపడేరు! కాదండీ బాబూ! రూలింగ్ పార్టీవారు... అప్పోజిషన్ నాయకులు నిత్యం నిర్వహించే 'బంద్' అనుకునేరు!. అదీకాదు!!

క్రికెట్ అంటే ఇష్టం లేనివారుండరీ భువిలో! టీ.వీ.లో మ్యాచ్ చూస్తూ పిల్లలు సైతం తామే క్రికెట్ ఆడుతున్నట్టు విన్యాసాలు చేస్తూండటం కద్దు!.

మా ఇంట్లో పెద్దవాళ్ల విషయానికొస్తే పెంచురీ కొట్టబోతున్న మా బామ్మ అందరికంటే ముందు ఠంచనుగ గేమ్ ప్రారంభానికి ముందే టి.వీ.కి అతుక్కుపోతుంది. చెవులురిక్కించి రన్నింగ్ కామెంట్రీ వింటూ ఆట వీక్షిస్తూ తెగసంబరపడుతుంది ఫోరో... సిక్సరో... ఏ ప్లేయరైనా కొట్టాడంటే తాను ఇంట్లో చిందులేస్తుంది. పళ్లూడిపోయిన బోసినోటితో పకపకా నవ్వి 'హిప్ హిప్ హుర్రే' అంటూ ఇంటి పైకప్పు ఎగిరిపోయేటట్టు కేకవేస్తుంది.

ఆట ముగిసేవరకు కూర్చున్నచోట నుండి కదల్దు! బాత్‌రూమ్‌కైనా సరే లేవదు. అన్నపానీయాలు ముట్టదు. ఇండియన్ టీమ్ గెలవాలనేసి అనంతకోటి దేవుళ్లకు మొక్కుతుంది. అథవా ఓటమి సంభవిస్తే తాను ఆత్మార్పణ చేసుకోవటానికైనా సిద్ధమే.

'ఆకలితో చచ్చిపోతావే బామ్మా! ... కాస్తంత ఎంగిలిపడు... అని బ్రతిమిలాడితే ససేమిరా అంటుంది.

కడుపులో ఎత్తులేక ఎక్కడ ఆకలితో మలమలమాడి నిస్త్రాణ వచ్చి నీరసంతో 'హరీ' అంటుందనే భయంతో నాభార్య వెండి కంచంలో వేడివేడి అన్నం దోసకాయ పప్పు... బంగళాదుంపల వేపుడు.... ఆవకాయతెచ్చి ముద్దలు చేసి బామ్మ నోటి కందించాలని విశ్వప్రయత్నం చేసినా ససేమిరాని భీష్మించుకుంటుంది. కళ్ళార్పితే ఎక్కడ బౌలింగ్ లేదూ బ్యాటింగ్ దృశ్యం మిస్సవుతుందోని రెప్పవాల్చకుండా క్రికెట్ ఆట వీక్షించటం బామ్మ హాబీ!

ఇక మా పిల్లల విషయానికొస్తే స్కూళ్లకు కాలేజీలకు 'డుమ్మా' కొట్టి కేరాఫ్ టీ.వీ. చానలే వాళ్ల అడ్రసు! లింగవయోబేధాల్లేకుండా క్రికెట్ అంటే ఎల్లరూ ఇష్టపడతారు.

ఒకవైపు మ్యాచ్ టీ.వీ.లో చూస్తూనే మరోవైపు పిల్లలు బ్యాట్లు పుచ్చుకొని తిప్పుతూ... ఇంట్లో ఆట ఆడుతూంటే... బాల్ వేగానికి కిటికీల గ్లాస్ ఫిట్టింగ్స్ పగిలి ముక్కలవుతూంటయ్. ఇది మామూలే!

మళ్లీ రిపేర్ చేయించటానికి ఎంత ఖర్చు అవుతుందో ఏమోరా దేవుడాని... నేను మనసులో ఒకటే ఏడుపు! ఎవ్వరినీ ఏమీ అనటానికిగాని నిందించటానికిగానీ వీల్లేదు. అంతటి ఆకతాయి వెదవలు నా నలుగురు వంశోద్ధారకులు!.

మా అమ్మాయి అయితే... ఆట చూస్తూ రన్నింగ్ కామెంట్రీ చేస్తూండకపోతే దానికి తోచిఏడవదు.

'నీకెందుకే ఈ క్రికెట్ గొడవ? ఆడపిల్లవి ఆడపిల్లలా వుండు...' అని మందలిస్తే...

'కాలేజీలో మా గరల్స్ టీమ్‌కి నేనే వికెట్ కీపర్ని... తెల్సా' గర్వంగ కనుబొమలెగరేస్తూ జవాబిస్తుంది.

మ్యాచ్ జరిగే రోజు ఇంట్లో పొయ్యి వెలగదు. ఆడంగులు వంటింటి ఛాయలక్కూడా పోరు. ఇంటిల్లిపాదీ పస్తే! ఆకలికి తట్టుకోలేని నా వంటి వాడు వీధిలోకెళ్లి ఏ హెూటల్లోనైనా ఇంత మింగి వాద్దమనుకుంటే... మ్యాచ్ జరిగే రోజు హెూటళ్లూ బందే!

ఇక ఆఫీసులకు వెళ్లే వారు సంగతి సరేసరి! ఫ్రెంచ్ లీవ్ పారేసి ఇంట్లో టి.వి.కి ఫెవికాల్ రాసుకుని ఫిక్సైపోతారు.

వీధులు... ఆఫీసులు... నిర్మానుష్యం! గల్లీ కుర్రాళ్లు సైతం బ్యాట్స్ పుచ్చుకుని ఆడుతూ వీరంగం వేస్తూ.... కేకలు పెడుతూ... తెగ సంబరపడటం చూపరులకు కనువిందు చేస్తుంది.

బెట్టింగులు... మ్యాచ్‌ఫిక్సింగులకు కొదవుండదు.

మా బాసైతే... ఆయన ఎ.సి. రూమ్‌లో ఏకంగ కలర్ టి.వీ. ఫిక్స్ చేయించేసుకున్నాడు. ఆఫీసుకు ఎవరొచ్చినా రాకున్నా... ఆయన మాత్రం రాక తప్పదు. కనుక... అటెండై... మందుకొడుతూ... చికెన్ బిర్యానీ తెప్పించుకుని తింటూ ఎన్టైర్ మ్యాచ్ ఎంజాయ్ చేసిగాని కొంపచేరుకోడు.

ప్లేయర్స్ విషయం చెప్పనక్కర్లేదు. బోలెడంత ఫాన్ ఫాలోయింగ్... వరల్డ్‌వైడ్

పాపులారిటీ కోట్లకొద్దీ ఆదాయం... యాడ్స్‌లో అప్పియరెన్స్ ఆడపిల్లల్లో క్రేజు... ఇంకా బోలెడుంటయ్!

నా దృష్టిలో క్రికెట్ ప్లేయర్స్‌కున్న క్రేజ్ సినీమా నటులక్కూడా వుండదంటాను. ఎర్నింగ్‌లో కూడా వీరికివీరే సాటి!. చివరకు దేశాధినేతలక్కూడా వీరికి వున్నంతగ నేమ్... ఫేమ్... వుండదేమో అన్పిస్తుంది.

వీరి ఆట తిలకించేందుకు ప్రధానులు... ముఖ్యమంత్రులు... గవర్నర్లు... వ్యాపారస్థులు... సినీ ప్రముఖులు.. కుర్రకారు.. అన్ని వర్గాల...వయస్సులవారు పెవిలియన్లోకొచ్చి గేమ్ తిలకించటానికి ఇష్టపడతారు.

ఇదొక రకమైన పిచ్చి... కాదు వున్మాదం.. అంటువ్యాధిలాంటిదని నా అభిప్రాయం. ప్రేమ ఎంత పిచ్చిదో?... అంతకంటే వేయిరెట్లు ఎక్కువ ఇది!

ముఖాలకు వికృతంగ రంగులు పులుముకోవటం... జండాలు చేతపూని ఎగరటం... గెంతటం... కోతి వేషాలు వేయటం గమనార్హం!

మా ఇంట్లో కుటుంబసభ్యుల్లో కూడా అన్ని రకాల వెకిలివేషాలు వేస్తూవుంటారు. క్రికెట్ గేమ్ చూస్తున్నంతసేపు!. బామ్మ సరేసరి. క్రికెట్ ఆటంటే ఆమెకు ఆరోప్రాణం. ఎంపైర్లకు తెలియనన్ని రూల్సు ఆమెకు కరతలామలకం!

వన్డే మ్యాచి ఆడుతూంటే... మా ఇల్లొక యుద్ధభూమిని తలపిస్తుందంటే నమ్మండి! ఎవిరికి వారే యమునా తీరే! ఒకరి మాట మరొకరు వినే పరిస్థితి వుండదు.

ఫలానా రోజున మ్యాచ్ టీ.వీ. లో వస్తుందనే వార్త న్యూస్ పేపర్లో చూడగానే... మా శ్రీమతి మురుకులు... చెక్కలు... చేగోడీలు వంటి స్నాక్స్ చేసి డబ్బాల్లో పోసి వుంచుతుంది. టాస్ వేసి ఆట ముగిసి... బహుమతి ప్రదానం అయి ఆట సంపూర్ణమయ్యేదాకా స్నాక్సే అందిరికి కాలక్షేపం. ఎవరిక్కావలసింది వారు తీసుకుని తింటూ నోట్లో మిషనాడిస్తూంటారు. మేచ్ ఇండియా గెలిస్తే ఆ రాత్రికి నాలుగైదు అయిటెమ్స్‌తో డిన్నర్! లేదూ తిన్న స్నాక్స్ చాలెమ్మనుకుని అందరూ పస్తుపడుకోవలసిందే! కడుపు మాడ్చుకొక తప్పదు. భారత్ ఓడినందుకు మా ఇంటిల్లిపాదికీ ఇదో శిక్ష!. ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందనే సామెతలా... ఓటమి మా కడుపులు మాడుస్తుంది!.

పస్తుల బాధ తప్పించుకోవటానికైనా... ఇండియా టీమ్‌ను గెలిపించి పుణ్యం కట్టుకో దేవుడాని అందరి దేవుళ్లను ప్రార్థిస్తూంటాను.

X X X

జంటనగరాలు ఎప్పుడూ సందడిగానే వుంటయ్! స్థానికులేకాక వచ్చేపోయే జనం... బస్సులు... రైళ్లు... రాత్రింబవళ్లు రద్దీనే!. మనుషులు నడవటానికి వేల్లేనంతగ వాహనాలు రోడ్ల పై పరుగులు... ట్రాఫిక్‌జామ్‌లు, యాక్సిడెంట్లు... పేవ్‌మెంట్ల దురాక్రమణలతో ఒకటే కిటకిట!

అమ్ముకునే వారికి... అడుక్కునేవారికేం కొదువవుండదు. రాజకీయాలకు సెంటర్‌పాయింట్! మర్డర్లు... మానభంగాలు... దొంగతనాలు... దైర్జన్యాలు...బాంబు బ్లాస్ట్ వంటివి సర్వ సాధారణం!. పబ్లిక్ ప్లేసుల్లో... పార్కుల్లో... బస్టాపుల్లో ధూమపాన ప్రియులు చుట్ట బీడీ సిగరెట్ పొగను పక్కవాళ్ల మొహాన వూదేస్తూన్నా నోరుమెదపటానికి భయపడి చస్తారంటే!

గుట్కా నమిలి నడిరోడ్లపై వుమ్మేయటం... రోడ్డుపక్కనే సిగ్గు ఎగ్గూ విడిచి మూత్ర విసర్జన... కరంట్ స్థంభాలకు వురితాళ్లులా వేలాడే రకరకాల తీగెల సముదాయాలు. ఛైన్స్ స్నాచర్స్... పిక్ పాకెటర్స్‌తో సందడే సందిడి.

ఎప్పుడూ బంద్‌లు... నిరాహార దీక్షలు... నిరసనలతో జంటనగరాలు హోరెత్తుతుంటయ్.

ఇలాంటి సిటీ ఒక్కరోజైనా సందడి లేకుండా నిర్మానుష్యంగా వుండటం చూడం!. మూసీనది వెదజల్లే సుంగధ పరిమళ సువాసనలు జనానికి మత్తెక్కిస్తుంటయ్.! మురికి కూపాలకేం కొదువుండదు. నీళ్లుంటే... కరెంట్ వుండదు. పొంగిపొరలే డ్రైనేజీలు... నాలాలు... బీదాబిక్కీ బతుకులు మరీ దుర్భరం!

పగలే వెలిగే వీధిదీపాలు... ఉద్యోగ ధర్మం ఎరుగని వుద్యోగులు అధికారులు. పల్లెల్లో.. జిల్లాల్లో వున్నది అమ్మేసుకుని సిటీకొచ్చి బ్రతికేవారి సంఖ్యే ఎక్కువ.

చార్మినారు... సాలార్జంగ్ మ్యూజియం... హుసేన్‌సాగర్... గోల్కొండ వంటి చారిత్రక ప్రదేశాలు లేకపోతే... హైదరాబాద్ ముఖం చూచేవారే వుండరనిపిస్తుంది.

రాష్ట్ర రాజధాని అన్నపేరేగానీ... జంటనగరవాసులకు అన్నీ కష్టాలే!

ఇంతటి మహానగరం గురించి... మాదంటే మాదనే వాదనలు... కొట్లాటలు!

X X X

ఎంతో సందడిగా వుండే హైదరాబాద్ నగరం ఒకానొక రోజున నిర్మానుష్యంగ వుండటం చరిత్రలోనే లేదు. అలాంటిదిరోజు నరసంచారం రోడ్లపై స్థంభించిది. వాహనాలు తిరగటంలేదు... దుకాణాలు... మూతపడ్డయ్! చూద్దామన్నా ట్రాఫిక్ పోలీసుల జాడ కానరావటం లేదు. పోలీసువాళ్లు తిరగటంలేదు.

అంతా కర్ఫ్యూ వాతావరణం నెలకొన్నది జంటనగరాల్లో...!

ఇందుక్కారణం ఏమైవుంటుందో నా మట్టి బుర్రకు తట్టలేదు. ప్రతిపక్షాలన్నీ ఏకమై బంద్ పాటిస్తున్నాయా? స్కూల్స్ కాలేజీలు కూడా మూతపడ్డయ్!

ఇలాంటి పరిస్థితిలో ఆఫీసుకు వెళ్లాలా? వద్దా? అనే ప్రశ్న నాలో వుత్పన్నమైనయ్. స్కూటర్ కలవాడిని కాబట్టి సిటీ బస్‌తోను... ఆటోతోను నాకు పన్లేదు.

పిల్లలంతా ఇంట్లోనే బైఠాయించారు.

ఆఫీసుకు నామం పెట్టటమంటే నాకు చెడ్డ చిరాకు! నేను రెగ్యులర్... సిన్సియర్... అండ్ హానెస్ట్ పర్సన్ని! ప్రతి ఏడాది క్యాజువల్లీవులే మురిగిపోతుంటయ్. క్రమశిక్షణ నాకు ఆరోప్రాణం! ఇన్నేళ్ల సర్వీసులో ఒక్కరోజైనా ఆఫీసుకు లేటుగ వెళ్లి ఎరుగను.

అసలేం జరుగుతోంది సిటీలో..? ఎందుకు జనసంచారం లేకుండా పోయింది. హత్యారాజకీయాలవల్ల ప్రభుత్వమే ముందు జాగ్రత్త చర్యగా సెలవు ప్రకటించి కర్ఫ్యూ పెట్టించారా!

ఇలాంటి సమయంలో ఒంటరిగా స్కూటర్ మీద ఆఫీసుకు వెళ్లటమూ ప్రమాదమే అన్పించింది. ఎవరైనా రాయి విసిరితే?... పోలీసు తారసపడి కేసు బుక్ చేసి అరెస్ట్ చేసిలాక్కెళ్లి లాకప్‌లో తోస్తే?- అమ్మో... బతుకు కుక్కలు చింపిన విస్తరౌతుంది. పరువు మంటగలిసిపోతుంది!

సిటీ అంతా రాజస్థాన్ ఎడారిని తలపిస్తూండగ నేనొక్కడినే... ఒంటరిగా వీధిలోకి వెళ్లటమా? ఎంతప్రమాదం? - నేనసలే పిరికి సన్నాసిని!. ఆఫీసుకు వెళ్లకపోతే వర్కు పెండింగ్‌లో పడిపోతుంది అసలే ఈ మధ్య జంటనగరాల్లో బంద్‌లు ఎక్కువైన

కారణాన ఆఫీసుకు పోలేకపోవటంతో బోలెడంత పని పెండింగ్‌లో వుండిపోయింది.

నాలో ఎడతెరిపిలేని ఆలోచన్లు..!

ఏనాడు చేసుకున్న మహాపాపమో... కేపిటల్‌సిటీలో వుద్యోగం చేయాల్సి వచ్చింది.!- అనేసి నన్ను నేను నిందించుకున్నాను.

బ్రతుకు బాటలో ఎన్ని ఇబ్బందులో...? బాధలో? ఎన్నో అపసవ్యాలు... అపస్వరాలు... ఛీ! పాడు బతుకు... అన్పించింది.

ఇంతలో... 'ఒరే చందూ!... నిన్నేరా పిలిచేది... ఏమిటీ దీర్ఘాలోచన్లో పడ్డావ్?...' ప్రశ్నించింది బామ్మ

'ఏంలేదే బామ్మా!... ప్రస్తుత పరిస్థితిలో ఆఫీసుకు ఎట్లావెళ్లటమాని ఆలోచిస్తున్నాను...'

'ఒరే బడ్డు సన్నాసీ... అయితే నీకే విషయం తెలియదన్నమాట...'

'దేనిగురించే నువ్వు మాట్లాడేది?-' ఎదురు ప్రశ్నించాను

'అయితే పేపర్ చదివేడవలేదన్నమాట!...' బోసినోటితో పకపకా నవ్వింది బామ్మ.

నేను హెడ్‌లైన్సు చదివి వదిలేసినా... బామ్మ మాత్రం అక్షరం వదలకుండా పేపరంతా చదివి జీర్ణించుకుంటుంది. ఆమెకు అదే కాలక్షేపం!. విశేషాలేమైనా వుంటే... రాత్రిళ్లు భోజన సమయంలో నాకు చెప్తూంటుంది.

'ప్రపంచకప్ క్రికెట్ పోటీలు ప్రారంభమైనయ్‌రా వెర్రి వెధవా...'

'అయితే...'

ఇంతలో ఫోన్ రింగైంది!

వెళ్లి రిసీవర్ అందుకున్నాను.

'సార్... నేను! వెంకటరత్నాన్ని... అదేసార్... ఆఫీసు అటెండర్‌ని!... అవతలవైపు స్వరం విన్నాక...

'చెప్పేడు విషయమేమిటో?-" కోప్పడ్డాను.

'అదేసార్... వరల్డ్ కప్పు క్రికెట్ ఆట సందర్భంగ దేశంలోగల అన్ని రాష్ట్రాల ఆఫీసులకు... కేంద్ర ప్రభుత్వ ఆఫీసులకే కాదు... దుకాణాలకు... సినీమాహాళ్లకు...

అన్నింటికీ ఏకంగ పదిహేనురోజులు శలవుదినాలు (సంతాప దినాలు కాదు సుమా) ప్రకటించారని ఇప్పుడే 'ఫాక్స్' మెసేజ్ వచ్చింది సార్!' అన్నాడు.

'అయితే ఏంటిట?-'' అన్నాను ఫోన్లోనే.

మనమందరం మేచ్‌లన్నీ పూర్తి అయ్యేదాకా ఆఫీసుకు రానక్కర్లేదరు సార్.. వుంటాను...' అనేసి రిసీవర్ పెట్టేశాడు.

వాట్ ఎ పిటీ? - క్రికెట్ ఆటకోసం ఇన్నాళ్లు సెలవులా? - మ్యాచ్‌లు చూడటం కోసమే కాబోలు రొడ్లపై జన... వాహన సంచారం లేకుండాపోయింది... అనుకున్నాను.

మాకూ శలవులిచ్చేశారు డాడీ... పిల్లలంతా ముక్తకంఠంతో అన్నారు.

'క్రికెట్ మ్యాచ్‌ల పుణ్యమాని... ఈవిధంగనైనా రెండు వారాల పాటు నువ్వు ఆఫీసుకు వెళ్లటం తప్పింది...' అంది బామ్మ నా ముఖంలోకి చూస్తూ.

'నాకు వండివార్చే పనీతప్పింది!' కనుబొమ్మలెగరేస్తూ అంది నా శ్రీమతి.

అప్పుడే టి.వీ. లో టేప్ వచ్చింది... క్రికెట్ కారణంగ 'భారత్ బంద్' అంటూ!

ఓసీ క్రికెట్టూ!... నీవెంత పవర్‌ఫుల్లే అనేసి మనసులో గొణుక్కోక తిట్టుకోక తప్పలేదు.

--- సమాప్తం ---